# ఇదా సంస్కృతి?

స్పందనవాణి ఆగస్ట్ 1978

---

భార్య భర్త అడుగుజాడల్లో నడవడం మన సంప్రదాయం....

పాతివ్రత్యం మితిమించి దాని ఖరీదు ఒక ప్రాణం. అయితే అది మౌఢ్యం....

—జయప్రద

---

నా ఎదురుగా ఆమె మృతదేహం. ఆ కళేబరాన్ని పట్టుకొని గుండెలవిసేలా ఏడుస్తోందామె తల్లి. దూరాన తలవంచుకుని చేతులు కట్టుకుని అతను.

నా కళ్ళలో నీళ్ళు. నా గుండెల్లో మంట. ఎవరు? ఎవరు? ఆమె ఈ లేతచావుకు కారణమెవరు?"

★ ★ ★ ★

పదేళ్ళక్రితం నేను ప్రాక్టస్ పెట్టిన మొదటిరోజు వచ్చిన మొదటి పేషంట్-మానస.

నును సిగ్గుతో చెదిరే కళ్ళతో, వికసించీ వికసించని పెదాలతో, భారమైన కనురెప్పలతో నావైపు చూస్తూ తలవంచుకున్న ఆ పిల్లరూపం నాకింకా గుర్తుంది.

"నువ్వు గర్భవతివమ్మా"

ఆ పిల్ల కళ్ళు ఇంకా వాలిపోయాయి. కానీ ఆమె కనురెప్పలు మాత్రం ఓరగా చూస్తున్నాయి.

ఓ వింత అనుభూతితో చలిస్తున్నాయి.

"ఆ అమ్మాయిని మీరు కాస్త జాగ్రత్తగా చూడాలి. ఆమెకు గుండెజబ్బు కాస్త ప్రారంభదశలో వుంది. పూర్తి విశ్రాంతి అవసరం" అతనివేపు తిరుగుతూ చెప్పి మందులు రాసిచ్చాను.

అతను తలూపాడు.

ఆమె అతనివేపు తిరిగి సన్నగా నవ్వింది.

ఆ పిల్ల నవ్వేప్పుడు ఆ కళ్ళ మెరుపు నాకింకా గుర్తు వుంది.

మరో పదేళ్ళకి ఆ నవ్వేకళ్ళు జీవాన్ని కోల్పోయాయంటే దానికి కారణం ఎవరు?

మూతపడని కనురెప్పల వెనకగా ఆ ఎండిన కళ్ళల్లోకి ఏ శక్తో వరమిచ్చి జీవాన్ని నింపితే అది నన్నడగబోయే మొదటిప్రశ్న నాకు తెలుసు.

"డాక్టర్‌గారూ! మావారు ఏరీ?"

* * * *

"అరే! మానస! ఏమిటిది? ఇలా పాలిపోయావేమిటమ్మా?" ఆత్రతగా అడిగాను.

ఆ పిల్లన్నా, ఆ పిల్ల పేరన్నా నాకు చాలా ఇష్టం"

ఆమె నవ్వింది.

ఆమె నవ్వులో అందం ఇంకా పెరిగింది.

"మందులు వాడడంలేదా?" ఆరునెలల తర్వాత ఆ పిల్లను ప్రేమగా చూస్తూ అడిగాను.

ప్రతి డాక్టర్‌కు తన మొదటి పేషంట్ అంటే అభిమానముంటుందేమో!

"వాడుతున్నానమ్మా" నవ్వుతూనే అంది మానస.

"ఆఁ....వాడుతోంది. ఎంతసేపటికీ మొగుడికి చేసిపెట్టడం తెలుసు. చేసుకుని తిని, వచ్చిన ప్రతి సినిమాకు పోతే సరిపోయిందా? వంట్లో ఆరోగ్యం సంగతి చూసుకోవద్దూ! ఆ పిల్లోడికయినా బుద్ధుండొద్దూ....?"

"అమ్మా" తల్లివేపు చురుగ్గా చూసింది మానస.

కూతురి వాడిచూపులు పట్టించుకోలేదామె. కళ్ళనిండా నీరు నింపుకుంటూ అంది-

"డాక్టరమ్మా! మీరు మానసకు గుండెజబ్బని చెప్పిన దగ్గర్నుండి నా కంటికి కునుకేలేదు. ఈ పిల్లకి ఆ పిల్లాడికి ధ్యాసే లేదు"

ఈసారి నవ్వేసిందా పిల్ల.

"మా అమ్మదంతా చాదస్తం డాక్టరుగారూ"

నేను మాట్లాడకుండా ఆ పిల్లకు బి.పి. కట్టి చూసాను. రెండు వందలుంది.

కాళ్ళవైపు చూసాను.

అవి వాచి వున్నాయి.

ఆ పిల్ల పెదాలవైపు చూసాను.

అవి మందహాసం చేస్తున్నాయి.

ఆమె తల్లివైపు చూసాను. ఆమె వంగి ఆత్రుతగా నా ఓదార్పు కొరకు చూస్తోంది.

"అతనేడీ?" అడిగాను అక్కడ ఆ పరిస్థితిలో వుండాల్సిన వ్యక్తి నుద్దేశించి.

అంతవరకు ఆత్రుతగా వంగి వున్న ఆమె తల్లి ఉసూరుమంటూ వెనక్కి వాలింది.

"ఇప్పుడెందుకొస్తాడు తల్లీ! ఇప్పుడిదేం సుఖమివ్వగలదనీ"

"అంటే....?"

"పెళ్ళయిన పదినెలలకే పురిటిరోజులొచ్చే"

"అమ్మా!" తలతిప్పి నిలబడున్న తల్లివైపు విసుగ్గా చురుగ్గా చూసింది మానస.

అంటే ఆడది సుఖమివ్వని రోజుల్లో మగవాడికి ఆమె అవసరం లేదా? అదే నిజమైతే ఆడదానికి అవసరమయిన రోజుల్లో చేయి అందించని మగవాని తోడు ఆడదానికెందుకు?

"ఏమైంది తల్లీ! తొందరగా చెప్పమ్మా" మానస తల్లి ఆతృతలో నేను తేరుకున్నాను.

"ఏమీ లేదు. అలా కాకుండా చూడాలనే నా ఆరాటం" అని

మానసను నర్సుతో యూరిన్ పరీక్షకి పంపి ఆమె తల్లితో మెల్లగా చెప్పాను.

"మానసకు బి పి. వుంది. కాళ్ళవాపులున్నాయి. గుణం రావడానికవకాశం వుంది. అసలే గుండెజబ్బు పిల్ల. అడ్మిట్ చేస్తే అవసరాన్ని బట్టి ఇంజక్షన్స్ ఇచ్చుకోవల్సి వుంటుంది."

"అలాగే తల్లీ!"

కానీ ఆ పిల్ల అడ్మిట్ కాలేదు.

"మా వారి పర్మిషన్ లేకుండా ఎలా డాక్టరుగారూ? ఆయన్ని అడిగివచ్చి అడ్మిట్ అవుతాను" అన్న ఆ పిల్ల మరో పదిరోజులకు స్మృతిలేని స్థితిలో కాళ్ళు చేతులు కొట్టుకుంటూ నా నర్సింగ్ హోమ్‌కు తేబడింది.

ఆ పిల్ల కివ్వాల్సిన ట్రీట్‌మెంట్ ఇచ్చి—

"ఫిట్స్ రాకుండా చూచుకోవాలేకానీ వచ్చాక ఆమె బ్రతుకుతుందని గ్యారంటీ ఇవ్వలేమమ్మా....!" అన్నాను కాస్త బాధగా కాస్త కోపంగా.

ఆ నిజం ఆమెకు చెప్పినందువల్ల ప్రయోజనం లేదు, బాధతప్ప. అది నాకు తెలుసు. కానీ అలా చెప్పడం డాక్టరుగా నా బాధ్యత, నా జాగ్రత్త

ఆమె భోరున ఏడ్చింది.

నాకు జాలి వేయలేదు. మానసను ఈ స్థితిలో తీసుకొచ్చిన వాళ్ళంటే చాలా కోపంగా వుంది నాకు.

"ఆ రోజు అడ్మిట్ చేసుంటే యింత దూరం రాదుగా."

"ఆ దౌర్భాగ్యుడు తల్లీ....ఇదిలేందే బ్రతకలేడట. ఆ పాతకుడికి యిది పక్కలో లేకపోతే నిద్ర పట్టదట."

ఆమె భాష కాస్త మొరటుగా అన్పించింది నాకు. కానీ నాకు తెలుసు ఆమె కడుపు శోకం ఆమె చేత అలా మాట్లాడిస్తోంది.

ఆ పిల్ల విపరీతంగా పెదాలు కొరుక్కుంటోంది. ఇంజక్షన్ ఇచ్చి ఆ పెదాల కదలికలు ఆగడం కొరకు అనాడు ఎదురు చూసాను నేను.

ఈనాడు ఏ ఇంజక్షన్ కదిలించలేని నిర్జీవమయిన ఆ పెదాల వంక నిశ్చలంగా చూస్తున్న నాకు ఆమె పెదాలు కదిలినట్టుగా భ్రాంతి 'ఎలాగండీ.... నేను వెళ్ళిపోయాను. మీకు నిద్ర ఎలా పడుతుంది? మీకు అన్నం ఎవరు పెడతారు....?'

"మానసమ్మా నా తల్లీ నా కన్యాయం చేసిపోయావా అమ్మా!" ఉలిక్కిపడ్డాను.

★ ★ ★ ★

"మానసా, నా కన్యాయం చేయకు తల్లీ, ఇంత గుండె జబ్బులో నీ కాప్రేషన్ ఏమిటమ్మా!"

"అంతగా పిల్లలు పుట్టకూడ దనుకుంటే అతను ఆరోగ్యంగా ఉన్నాడుగా అతనిని చేయించుకోమను తల్లీ."

ఏడు సంవత్సరాలలో ఆరు కాన్పుల తరువాత కూడా ఆ సలహా ఇచ్చి ఆ పిల్లను మృత్యు ముఖంలోకి పంపించదల్చుకోలేదు నేను. ప్రతి కాన్పుకు నేను అతన్ని బ్రతిమలాడేదాన్ని, కోప్పడేదాన్ని. 'ఇక పిల్లలు పుట్ట కూడదు ఆప్రేషన్ చేయించుకోమని. అతను సరేననేవాడు. మరలా గర్భంతోనే ఆ పిల్ల నా కగుపించేది. ప్రతి కాన్పు ఆ పిల్లకో గండం. మొదటి కాన్పు నుండి ఆ గుణం తీవ్రతనుండి మానస సవ్యంగా బయట పడ్డాక నేను అతనికి సలహా ఇచ్చాను. గుండె స్పెషలిస్ట్ దగ్గరకు తీసు కెళ్ళి ఆపరేషన్ చేయిస్తే బాగుంటుందని- నెలతర్వాత తీసుకెళతా నన్నాడు.

నెల కాదు, సంవత్సరం కాదు, ఆరోజు రానే లేదు. కానీ అరుగురు బిడ్డల తల్లి అయ్యేలోగా నా చేతిలోనే ఆమె గుండె రెండు సార్లు ఫెయిల్యుర్‌లో కెళ్ళి కోలుకుంది. ఆమె ఆఖరు కాన్పు తర్వాత నా దగ్గర చాలా రోజులుంచుకున్నాను. ఆమె ఆరోగ్యం బాగుందనుకున్న రోజు మానసతో ఆపరేషన్ చేస్తానని చెప్పినప్పుడు ఆ పిల్ల ఈ కాన్పులకు విసిగి పోయిందో, భర్త మీద విశ్వాసమే సడలిపోయిందో వెంటనే అంగీకారం తెల్పింది.

"నాకు బాగా తెలుసు. ఈ ఆపరేషన్‌తో అది చచ్చిపోతే రెండో పెళ్ళి మూడో నాటికల్లా చేసుకోవాలని అతని ఆశ. మీరు చేయొద్దు డాక్టరమ్మా. అతను ఈ రోగిష్టి పెళ్ళాన్ని వదిలించుకోవాలని చూస్తున్నాడు నా కడుపులో మంట పెట్టకు తల్లీ."

నేనాలోచించాను.

'ఊహుఁ ఇప్పుడు ఈ పిల్లను పంపితే మరలా గర్భంతోనే రావడము, ఆ తర్వాత ఆ పిల్ల గుండె మరలా ఫెయిల్యూర్‌లో కెళితే.... ఇక ఆ పిల్లను బ్రతికించడం నా శక్తికి మించిన పని....'

అందుకే అతనిని పిలిచి అడిగినప్పుడు వెంటనే ఒప్పుకున్నాడతను.

అంటే అతని ప్రాణం విలువ తన భార్య ప్రాణానికి లేదన్న మాట.

'ఎంత స్వార్థం? ఎంత అమానుషత్వం!'

* * * *

"టాక్సీ వచ్చింది. తీసుకువెళదామా?"

"ఎంత పుణ్యం చేసుకుందో పునిత్రీ చావు! ఎంతమంది కొస్తుంది ఆ అదృష్టం!"

మరలా ఉలిక్కిపడ్డాను. ఇలా ఉలిక్కిపడడం నా కలవాటయి పోయింది.

"మానస అదృష్టవంతురాలా? పునిస్త్రీ చావు లభించింది కనుక. అదృష్టవంతురాలా?"

"కాస్త కుంకుమబొట్టు పెట్టండి తీసుకెళ్ళి."

"ఆ తల్లిని కాస్త ప్రక్కకు లాగండి."

నా కవేమి విన్పించడంలేదు.

మానస అదృష్టవంతురాలా? తాగితందనాలాడడానికున్న డబ్బు భార్య గుండెజబ్బు తాలూకు ఐదు పైసలు మాత్రకు లేదన్నప్పుడు ఆ పిల్ల బలహీనపు గుండె ఎంత బాధపడుంటుందో?

పుట్టింటికి వెళ్ళాలని ఒక రోజు ప్రాధేయపడినప్పుడు, నా కన్నం ఎవరు వండిపెడతారు అన్న భర్తకు భార్యగా పోవడమా అదృష్టం! తన ఆనందాలు తప్ప ఆ సుఖాలకు ఫలితంగా పుట్టిన జబ్బులలో ఒళ్ళు కుళ్ళిపోతుంటే- దూరంగా వుండమని ప్రాధేయపడితే నేను నిన్ను పెళ్ళి చేసుకున్న దెందుకన్న భర్తకు భార్య కావడమా అదృష్టం!

చీకటి క్షణాలకు ఫలితంగా పుట్టిన బిడ్డకు జబ్బుచేస్తే భార్య ఎదాన పారేసి సానిదానింటి కెళ్ళొచ్చి చచ్చిపోయిన బిడ్డ శవాన్ని పాతి పెట్టడానికి పనికొచ్చిన ఆ మానవుడికి శ్రీమతి అయినందుకా అదృష్టం.

"నా తల్లీ! నా మానసా వెళ్ళిపోతున్నావా? ఇప్పుడైనా ఇంటి కొక్కసారి రారాదా తల్లీ!" ఆమె రోదిస్తోంది. నా గది, నా గుండె దద్దరిల్లుతున్నాయి.

* * * *

'ఈసారన్నా నా ఇంటికి రా తల్లీ, నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాను. నాలుగు కాలాలపాటు బ్రతికించుకుంటాను.'

రెండు నెలల క్రితం విపరీతమైన ఆయాసంతో కూతుర్ని నా దగ్గరకు తీసుకొచ్చి ట్రీట్ చేయించుకుని నేను డిస్చార్జ్ చేసిన రోజు

ఆ తల్లి బిడ్డను ప్రాధేయపడుతోంది. కని పెంచి పెద్దజేసిన బిడ్డను, తను పెరిగిన ఆ ఇంటికి వచ్చి కొన్నిరోజులు విశ్రాంతి తీసుకోమని వేడుకుంటోంది.

"వద్దులేమ్మా, ఆయనకెవరు చేసి పెడతారు?"

ఆ తల్లి గుండెలు మండిపోయినట్టున్నాయి.

"అతను అసలు నీ కొరకేం చేసాడే అతని క్షేమం గురించి నువ్వంతగా ప్రాకులాడడానికి?"

విరక్తిగా విచారంగా నవ్వింది మానస.

"అతను నాకేం చేసినా చెయ్యకపోయినా అమ్మా, అతని భార్యగా చచ్చేదాకా అది నా ధర్మం."

మానస తల్లి ఏదో మాట్లాడబోయింది. నేను ఆపేసాను.

"పోనీ మానసా, నువ్వు చెప్పింది నిజమే అనుకుందాం. కొన్ని రోజులు వాళ్ళ తల్లో, అక్కచెల్లెళ్ళనో వండిపెట్టమని చెప్పు. నీ ఆరోగ్యం కాస్త కోలుకున్నాక అలాగే నీ భర్తకు చేసిపెడుదువు గాని."

"ఆఁ అంత అదృష్టంకూడానా?

చచ్చేరోజుకూడా మొగుడి సంగతి చూసుకోవాల్సిన బాధ్యత పెళ్ళానిదే అంటుంది ఆ ఆడబిడ్డ. ఆ తల్లి సరేసరి, ఈ కొద్ది అయాసాని కేనా ఇంత హంగామా అంటుంది."

"అయితే నీకు చేసిపెట్టేవాళ్ళెవరూ లేరన్నమాట" నిరాశగా అడిగాను.

ఒకప్రక్క ఈ ఫిక్సెడ్ సాంప్రదాయాల రూపం చూస్తుంటే ఒళ్ళు మండిపోతోంది.

నేను సాంప్రదాయాలను ఏ మాత్రం దూషించినా సహించగలిగే శక్తి మానసకు లేదు. అందుకే ఆమెను రెచ్చగొట్టడం యిష్టంలేక ఊరుకున్నాను. కానీ ఆ తల్లి మాత్రం ఊరుకోలేకపోయింది.

"దీనికి అన్నీ చాదస్తాలు, నాలుగురోజులు పుట్టింట్లో వుంటే పరువుపోతుందా? మొగుడు కందిపోతాడా?"

నేను నవ్వుతూ అన్నాను. "ఏ గూటి చిలక ఆ గూటిపలుకులే పలుకుతుంది. నువ్విలా పెంచాల్సింది కాదు రవణమ్మా! మానసను."

ఆమె నిట్టూర్చింది.

"నిజమే.... నిజమే" గొణిగింది.

అంతవరకు నేను గమనించలేదు, మాకు కాస్త దూరంగా నిలుచున్న జంట కాస్త సంకోచంగా వచ్చి నా ఎదురుగా నిల్చున్నారు. అంతలో అతనన్నాడు.

"మా వదినను మేము తీసుకెళతామండీ-వున్నంతలో ఆమెకు జరుపుతాము."

"ఒంట్లో బాగున్నప్పుడు మా ఇంట్లో వుంచుకుని, బాగోలేనపుడు పుట్టింటికి పంపడం న్యాయంకాదు" నేనింతవరకు వాళ్ళిద్దరినెప్పుడూ చూడలేదు. ప్రశ్నార్థకంగా మానసవేపు చూసాను.

"మా మరదిగారు, మా తోడికోడలు" పరిచయం చేసిందాపిల్ల. నేను అతనివైపు ఆరాధనగా చూసాను.

మానస తాలూకు మూర్ఖపు మొగుడి తమ్ముడి ఆంతర్యం ఎంత అందమైంది! అన్నదమ్ముల్లోనే ఎంత వ్యత్యాసం!

"నమస్కారం డాక్టరమ్మా! నేను వెళతాను" మానస ఏమి నిర్ణయించుకుందోగాని నిశ్శబ్దంగా వెళ్ళిపోయింది.

* * * *

చప్పున నా ఆలోచనలనుండి తేరుకున్నాను. ఆనాడు అందంగా ముడుచుకున్న ఆ చేతులను ఎవరో బలంగా తాళ్ళతో కట్టి ఆమెను లేవదీయడానికి ప్రయత్నిస్తున్నారు. నా కళ్ళల్లోనూ తడి నిలిచింది.

రెండురోజుల క్రితం మానసను హార్ట్ ఫెయిల్యూర్ స్టేజ్‌లో నా దగ్గరకు తీసుకొచ్చారు. ఈసారి నాకు చాలా కోపమొచ్చింది. నా ఎదురునా నిలుచున్న మానస భర్తను విసుక్కున్నాను.

"మీరసలు మనుష్యులా? అప్పుడే మరలా ఏమిటిది?"

ఆయన సణిగాడు.

"మేమేం చేయలేదు, మందులు మింగుతూనే వుంది. రెస్ట్‌గానే వుంది. పిల్లల్లేకుండా ఆపరేషన్ చేసింది మొదలుకుని అది కోలుకోలేక పోతోంది."

"షటప్."

అరిచాను. అతనేం మాట్లాడలేదు. తలవంచుకుని బయట కెళ్ళి పోయాడు.

"అతన్నిలా పిలుస్తారా!"

"వద్దులెండి డాక్టర్‌గారూ, ఏదో చావో బ్రతుకో అతనితోనే తెల్లారిపోనివ్వండి అతన్నేమనకండి."

మానస పతివ్రత కబుర్లు నాకు నచ్చడంలేదు.

"అందుకు కాదులేమ్మా పంపు" అని మానసను అక్కడనుండి పంపేసాను.

అతనొచ్చాడు. నేను చెప్పాను. మానసను హార్ట్ స్పెషలిస్టు దగ్గరకు పంపుతున్నాను మద్రాసు తీసుకెళ్ళండి అని.

"అలాగే"

"ఎప్పుడు?"

"ఓ నెలాగి"

చెంపమీద ఛెళ్ళున కొట్టాలనిపించింది. అయినా నిదానంగానే అన్నాను.

"అంతవరకు మానస బ్రతకదు" అతనేం మాట్లాడలేదు. తల వంచుకుని బయట కెళ్ళిపోయాడు.

"అతనికి ఆస్థిపాస్థులు లేవా? మద్రాసు ఖర్చులు భరించ లేడా?"

"ఉండకే వున్నాయి" నిష్ఠూరంగా అంది తల్లి.

మానస మెల్లగా ఆయాసంగా నడిచివచ్చి నా ప్రక్కన కూరుచుంటూ మొదటిమారుగా తన భర్తపట్ల తన నిరసనను తెలుపుతూ నాలుగు మాటలంది. నేను ఆశ్చర్యపోయాను.

"డబ్బుకీ ప్రేమకీ నేను లంకె పెట్టనుగాని డాక్టర్‌గారూ! నా ప్రాణం కంటే ఆయనకు డబ్బే ముఖ్యం అనిపించినప్పుడు మాత్రం చాలా గుండెకోతగా వుంటుందండీ!"

అలా అనేసి నీరసంగా లేచి వెళ్ళిపోయిన ఆమెను మరలా నేనీరోజు ప్రాణం పోయాక చూశాను. ప్రాణం పోయాక, ఇంట్లో ప్రాణం పోతే నలుగురూ నాలుగు రకాలుగా అంటారని ఆ కట్టెను ఇక్కడకు తీసుకొచ్చాడతను.

తలెత్తి చూసాను. అతను తలవంచుకుని చేతులు కట్టుకుని నిలుచున్నాడు. ఇక అతనిని తిట్టే అవసరం నాకు లేదు. ఆ తల్లి వెళ్ళిపోతున్న కూతురి కాళ్ళుపట్టుకుని రోదిస్తోంది.

"ఆ పిల్ల ఈ లేతచావుకు ఎవరు-ఎవరు కారణం?" నా అంతరాత్మ ప్రశ్నిస్తూంది.

అతనా? ఆమె జబ్బా? సంపూర్ణంగా ఏదీకాదు-దానికి కారణం మన సంస్కృతి.

'భార్య అంటే ఇలా వుండాలి' అని మన పూజ్య పూర్వీకులు చెప్పిన మాటలను అక్షరాలా పాటించిన మానస ఎదగని మనస్సు.

లేకపోతే భర్తను కాస్త ఎదిరించి వుండుంటే ఆమె బ్రతికుండేది.

"....వీళ్ళు....వీళ్ళు....మన సంస్కృతి....భారతీయ సంస్కృతి అని గొప్పలు చెప్పుకునే కాలాన్ని 'మన సంస్కృతి మన కెంతవరకు శాంతిని సుఖాన్ని ఇస్తుంది' అని ఆలోచించడానికి వెచ్చిస్తే-మన జీవితాలు ఎంత సుందరంగా నిలుస్తాయి!"

నిట్టూర్చాను.